గృహమే కదా స్వర్గసీమ

ఇటుకా.. ఇటుకా పేర్చి ఇల్లు కట్టించుకుని.. అందులో కుటుంబ సభ్యులతో హాయిగా ఉంటే ఆ గృహం నిజంగా స్వర్గసీమే కదా!.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ప్రస్తుతం ఎంతో మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆ వైభోగం కలిగింది. కూలీనాలీ చేసుకుంటూ బతుకులీడుస్తున్న వారు... చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీసేవారు.. ఇలా ఒకరేమిటి అన్ని వర్గాల వారికి సొంతింటి కల సాకారం చేశారు. అద్దె కొంపల్లో అష్టకష్టాలు పడుతున్న వారికి, పూరిళ్లలో మగ్గుతున్న వారికి విముక్తి కల్పించారు.

పేదలకు సొంతింటి కల సాకారం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

ఊర్లుగా వెలసిన జగనన్న కాలనీలు



మాకవరపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లోని పేదలందరికీ ఇళ్లు పథకంతో గూడు లేని వారికి సొంతింటి కల నెరవేరింది. అర్హులైన పేదలకు జగనన్న కాలనీల్లో సెంటున్నర చొప్పున ఇంటి స్థలం పంపిణీతోపాటు గృహాలు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఉచితంగా 20 టన్నుల ఇసుక, మార్కెట్ కంటే తక్కువ ధరకు 90 బస్తాల సిమెంటు ఇస్తోంది. నిర్మాణాలు చేస్తున్న ప్రతి లబ్ధిదారుడికి దశల వారీగా సకాలంలో బిల్లులు అందిస్తున్నట్టు వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మాకవరపాలెం మండలం

గ్రామ సచివాలయాలు
15

జగనన్న లేవుట్లు
32

కాలనీ లబ్ధిదారులు
1,322 మంది

ఒక్కో ఇంటి నిర్మాణానికి మంజూరైన నగదు
రూ.**1.80** లక్షలు

ఇంత వరకు పూర్తయిన ఇళ్లు
342

ఇప్పటివరకు ఇళ్ల బిల్లుల చెల్లింపు
రూ.**11.18** కోట్లు





అద్దె భారం తప్పింది



ఇప్పటివరకు నాకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లోనే ఉంటూ ఇబ్బందులు పడేవాళ్లం. పిల్లలను చదివించుకుంటూ అద్దె చెల్లించుకోవడం చాలా కష్టంగా ఉండేది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇంటిని నిర్మించుకుని ఆనందంగా జీవిస్తున్నాం. మాకు సొంతింటి కల నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సయ్యద్ రేష్మ, గృహ లబ్ధిదారు, మాకవరపాలెం

సకాలంలో బిల్లు ఇచ్చారు



ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సకాలంలో బిల్లులు మంజూరు చేశారు. దాంతో త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోగలిగాను. పది నెలలుగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిలోనే నివాసం ఉంటున్నాను.

– కొరుప్రోలు పార్వతమ్మ, గృహ లబ్ధిదారు, రామన్నపాలెం

క్లుప్తంగా

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం



భక్తులకు వడ్డనలు చేస్తున్న సర్పంచ్ అప్పాజి

కె.కోటపాడు: ఆనందపురంలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గౌరీపరమేశ్వరులకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి ఉత్సవమూర్తులను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించి చెరువులో అనుపు పూర్తి చేశారు. సర్పంచ్ వంటాకు అప్పాజి, మాజీ సర్పంచ్ గురు బంగారునాయుడు, మాజీ ఉప సర్పంచ్ వంటాకు మహేష్ పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు నగదు అందజేస్తున్న గొల్లవిల్లి నాగమణి

మాడుగుల రూరల్: ఎం.కోడూరు హైస్కూలులో ఈ ఏడాది మార్చి పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గొల్లవిల్లి నాగమణి తన భర్త వరహమూర్తి జ్ఞాపకార్థంగా శనివారం ప్రోత్సాహకాలు అందజేశారు. రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3 వేల చొప్పున ముగ్గురు విద్యార్థులకు అందజేశారు. అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, స్కూలు కమిటీ చైర్‌పర్సన్ కోన అన్నపూర్ణ, అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో కళ్లద్దాల పంపిణీ

చోడవరం: లక్ష్మీపురంలో సర్పంచ్ శిరుచోళ్ల గణపతినాయుడు వృద్ధులకు కళ్లద్దాలు శనివారం పంపిణీ చేశారు. ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇక్కడ కంటి వైద్య శిబిరంలో పలువురికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 36 మందికి దృష్టిలోపం గుర్తించి కళ్లద్దాలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరందరికీ ప్రభుత్వం సమకూర్చిన ఉచిత కళ్లద్దాలను అందజేశారు. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీటీసీలు షేక్ రహమాన్, సంద్రాన వీరన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తే చర్యలు



ఆటో డ్రైవర్లుకు సూచనలు చేస్తున్న ఎస్.ఐ రామకృష్ణ

కె.కోటపాడు: ఆటో డ్రైవర్లు వాహన పరిమితి మేరకు ప్రయాణికులను ఎక్కించాలని ఎస్ఐ బి.రామకృష్ణ తెలిపారు. ఎ.కోడూరు పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో శనివారం ఆయన సమావేశమయ్యారు. పరిమితికి మించి ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కిస్తే తప్పనిసరిగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

మంచినీటి బోరు ఆక్రమణపై మహిళల నిరసన



బోరు హెడ్ తొలగించిన ఆక్రమణదారుడు

బుచ్చెయ్యపేట: రాజాం బీసీ కాలనీలో మంచినీటి బోరును ఆక్రమించడంపై శనివారం స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. ఇక్కడ తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండగా, ప్రభుత్వ బోరును గ్రామస్తుడు ఆక్రమించి ఫెన్సింగ్ వేయడంతో తాగునీరు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
బోరు బాగు చేసి తాగునీరు అందించాలని గ్రామానికి చెందిన పిల్లి దేవి, అక్కమ్మ, లావేటి లక్ష్మి, చొప్పా అమ్మాజి, రవణమ్మ, పిల్లి సింహాచలం, షేక్ బీస్ జాన్, పొనంటి వేణు, భవాని కోరారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

కె.కోటపాడు: చౌడువాడలో శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో గొంప కాంతమ్మ పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె వైద్యం చేయించుకునేందుకు తన కుమార్తె వద్దకు అడ్డూరు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని బోరుమంది. ఇంట్లో నిత్యావసర సరకులు, రెండు తులాల బంగారు నగలతోపాటు రూ.2 లక్షలు కాలిపోయాయని వాపోయింది.

బాధితురాలికి ఆర్థిక సాయం

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కాంతమ్మను వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు శనివారం పరామర్శించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తామని చెప్పి జెడ్పీటీసీ కొంత నగదు అందించారు. తాత్కాలికంగా రేకుల షెడ్ వేసుకునేందుకు కావాల్సిన పైప్‌లను అందించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ రూ.2 వేలు అందించారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఆకుల సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామునాయుడు, వీఆర్వో ముత్యాలు, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్

రూ.31 కోట్ల స్త్రీనిధి రుణాల లక్ష్యం

ఏరియా స్త్రీనిధి మేనేజరు సత్యనారాయణ

నాతవరం: క్లస్టరు పరిధిలో ఈ ఏడాది 6,240 మంది డ్వాక్రా మహిళలకు రూ.31 కోట్ల స్త్రీనిధి రుణాలు ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని స్త్రీనిధి ఏరియా మేనేజరు సత్యనారాయణ తెలిపారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం నాతవరంలో లింగవివక్షపై అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవరం, నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, రోలుగుంట మండలాల పరిధిలో ఇంతవరకు 5,735 మందికి రూ.28.81 కోట్లు ఇచ్చామన్నారు. మిగతా సభ్యులకు విడతల వారీగా రుణాలు ఇవ్వడానికి చర్యలు చేపట్టామన్నారు. గతంలో తీసుకున్న స్త్రీనిధి రుణాలు రికవరీ శాతం బాగుందన్నారు. ప్రతి నెలా అవగాహన సదస్సులు నిర్వహించి సంఘాలను మరింత అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామన్నారు. వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, సీఏలు వాసు, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నాతవరం: 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించే బాధ్యత మనందరిపై ఉందని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం తెలిపారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 262 పోలింగ్ బూత్‌ల వారీగా సిబ్బంది ఓటర్ల జాబితాలో తప్పులను సరి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబరు నెలాఖరులోగా జగనన్న భూరీ సర్వే శతశాతం పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఆర్ఐ హరి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ పాల్గొన్నారు.

రోలుగుంట: ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలని చోడవరం నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి డి.ప్రమీలాగాంధీ బీఎల్వోలను ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో ఆమె సమావేశమయ్యారు. పలు సూచనలు, సలహాలు చేశారు. వీరి విధులను పర్యవేక్షించాలని తహసీల్దార్ వరహాలుకు సూచించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో జయరాం

ఏసు బోధనలు ఆచరణీయం

కె.కోటపాడు: లోక రక్షకుడైన ఏసు బోధనలు ఆచరించడంతోపాటు సేవా మార్గంలో కొనసాగాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ తెలిపారు. రొంగలినాయుడుపాలెంలో అగాపే చర్చి 27వ వార్షికోత్సవం సందర్భంగా కె.కోటపాడులో శుక్రవారం రాత్రి సర్వసత్య మహాసభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పాస్టర్ కె.శ్యామ్, మేరీ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ పైల పైడితల్లమ్మ, కోటేశ్వరరావు, బి.నాయుడు(కాలేబు) పాల్గొన్నారు.

రోలుగుంట: అందరూ పవిత్రులు కావాలని కొత్త కోట ఆర్సీఎం చర్చి ఫాదర్ అజయ్‌కుమార్ కోరారు. శనివారం రాత్రి రోలుగుంట పురవీధుల్లో పలు గ్రామాల క్రైస్తవులు ఏసుప్రభు విగ్రహాన్ని ఊరేగిస్తూ ర్యాలీ చేశారు. అనంతరం ప్రార్థనలు చేశారు.



రోలుగుంటలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

సరిహద్దు రైతులకు సమస్య లేకుండా సర్వే

రోలుగుంట: మండలంలో జగ్గంపేట, రత్నంపేట, వడ్డిప తదితర గ్రామాల్లో రెండో విడత భూసర్వేను తహసీల్దార్ కె.వరహాలు పర్యవేక్షించారు. భూసరిహద్దు రైతులను హాజరుపరచి ఏ విధమైన వివాదాలకు తావులేకుండా, వారికి మేలు చేసే విధంగా సాగు విస్తీర్ణం నమోదు చేయాలన్నారు. వివాదాలు ఎదురైతే తన దృష్టికి తీసుకు రావాలని సిబ్బందికి సూచించారు.

నేడు వడ్డాది శివాలయంలో నవగ్రహ పూజ

బుచ్చెయ్యపేట: వడ్డాది భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం నవగ్రహ పూజ, నక్షత్ర పూజ నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ శ్వేతవర్ణ శివలింగం ఉండటంతో కార్తీక మాసంలో వేలాది మంది భక్తులు తరలివచ్చి పూజలు చేస్తారు.

ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. మాకవరపాలెం ఎస్సీ వసతి గృహ భవనంలో ఈ శిక్షణ ఇస్తామని, పదో తరగతి, ఆపై చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, వివరాలకు శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యమే అసలైన సంపద



ఫిట్ ఇండియా పోటీలో విద్యార్థుల చిత్రాలు

చోడవరం రూరల్: ఆరోగ్యంగా ఉండడమే అసలైన సంపద అని హెచ్ఎం జి.జె.సుందర్ సింగ్ తెలిపారు. గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఫిట్ ఇండియా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిట్ ఇండియా లోగో తయారీ చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఎస్ కృప ఫిట్‌నెస్ గురించి అవగాహన కల్పించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ డే సందర్భంగా పీడీ మోహన్‌ను సత్కరించారు. ఉపాధ్యాయులు ఎ.రవిశంకర్, కె.విశ్వనాథ్, ఆర్.వి.దొర, సిహెచ్.సంజీవి, మహాలక్ష్మి, రమణి పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థినుల అవగాహన



రైతులకు పటం ద్వారా అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

రావికమతం: మత్స్యవానిపాలెంలో గ్రామీణ వ్యవసాయ పని అవగాహన, అనుభవం అనే కార్యక్రమం ద్వారా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శనివారం అవగాహన కల్పించారు. ఎచ్చెర్ల కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1952 నుంచి 2018 వరకు జరిగిన అభివృద్ధి 2021 నుంచి నుంచి ఇప్పటి వరకు సచివాలయాలు, ఆర్బీకేల ద్వారా గ్రామాల్లో రైతులకు కల్పించిన సౌకర్యాలు, అభివృద్ధి గురించి వివరించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ రాజేష్‌కుమార్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉండాలి



రాజ్యాంగ ప్రవేశిక ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: విద్యార్థి దశలో రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. లెక్చరర్లు సత్యవతి, రత్నభారతి, డి.మాల్యాద్రి, జ్యోతి, సూర్యవతి, సరస్వతి, రఫీయుద్దీన్, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిజిటల్ స్క్రీన్‌పై రాజ్యాంగంలోని భాగాలు, షెడ్యూళ్లను విద్యార్థులకు వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.కృష్ణ, అధ్యాపకులు ఎస్.సురేష్ బాబు, ఎం.కొండలరావు, జి.చెంచుబాబు, కె.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసుల పరిష్కారం

న్యాయ విజ్ఞాన సదస్సులో చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

కె.కోటపాడు: జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల వారి అంగీకారంతో పెండింగ్ కోర్టు కేసులకు పరిష్కారం లభించనున్నట్లు చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.అరుణశ్రీ తెలిపారు. కె.కె.అగ్రహారంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చునని తెలిపారు. దీనికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతో పాటు ఏడాదికి రూ.3 లక్షల ఆదాయంలోపు గల వారు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేయొద్దన్నారు. వివాదాలకు దూరంగా ఉన్న కె.కె.అగ్రహారం ఇతర గ్రామాలకు ఆదర్శమని ప్రశంసించారు. కె.కోటపాడు సీఐ తాతారావు, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, సర్పంచ్ చల్లా మంగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

గొటివాడ అగ్రహారంలో వికసిత్ భారత్

మాడుగుల: మండలంలోని గొటివాడ అగ్రహారం, చింతలూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు.
వైఎస్సార్ సీపీ నాయకుడు కాళింగ కళ్యాణరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, గొటివాడ సర్పంచ్ నందారపు మంగమ్మ, ఎంపీటీసీ ఆర్లి మాధవి, తహసీల్దార్ పీవీరత్నం, ఏవో ఎం. వాసుదేవరావు, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్. శ్రీదేవి, ఏపీఎం సీహెచ్ అప్పలనర్స, మెడికల్ ఆఫీసర్ ఆర్. మౌనిక పాల్గొన్నారు.



ఆయుష్మాన్ కార్డు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్ తదితరులు

మళ్లీ అధికారంలోకి తీసుకు రావాలి



బూరుగుపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ, నేతలు



నాగాపురంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు

మాకవరపాలెం: ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ కోరారు. శనివారం బూరుగుపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, పార్టీ నాయకులు పెట్ల భద్రాచలం, భీమిరెడ్డి గోవింద, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె నిద్ర చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన విభాగం మండలాధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం రాత్రి భోజనం చేసి అక్కడే బస చేశారు. శనివారం ఉదయం ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఉప సర్పంచ్ వందూరు సరువునాయుడు, కొరుపోలు శ్రీను పాల్గొన్నారు.



ఎ. కొత్తపల్లిలో పల్లె నిద్ర చేసిన వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు

గొలుగొండ: నాగాపురంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆవిష్కరించారు. అనంతరం ప్రతీ ఇంటికి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చారని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎంను మరలా గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.